క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు

పెద్దతిప్పసముద్రం: స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివాలయం సేవకులు ననగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శనివారం శని త్రయోదశి, నవ గ్రహాలకు పంచామృతాభిషేకాలు, శనీశ్వరునికి తైలాభిషేకం, ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, ఆకు పూజ, మహా మంగళహారతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

శాకంబరీ.. నమోస్తుతే

పెద్దతిప్పసముద్రం : ఆషాఢమాసం చివరి శనివారం పురస్కరించుకుని స్థానిక శ్రీ వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేశారు. వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలతో వాసవీమాతను శాకంబరీగా అలంకరించి భక్తుల దర్శనం కల్పించారు.

స్పెషల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

పీలేరు రూరల్ : ఈ నెల 22న నిర్వహించనున్న స్పెషల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీనివాసులునాయక్ అన్నారు. శనివారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు, తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మోటారు వాహన కేసులు, భూతగాదాలకు సంబంధించిన కేసులు స్పెషల్ లోక్ అదాలత్‌లో పరిష్కరించరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్. గాయత్రి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రఫీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిబిల్లుకు ముందస్తు ఆడిట్

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీలో బిల్లుల చెల్లింపు పూర్తి పారదర్శకతతో జరగనుందని జిల్లా ఆడిట్ అధికారి నాగరాజు చెప్పారు. శనివారం ఆయన నగర పంచాయతీ కార్యాలయంలో తాజా బిల్లులకు సంబంధించిన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి వాటి తయారీ, పాటిస్తున్న చెల్లింపు విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగిశాక జరిగిన చెల్లింపులు, ఖర్చుల వివరాలపై ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని, ఇకపై ముందస్తుగానే బిల్లుల పరిశీలన అయ్యాకే చెల్లింపులు జరుగుతాయని చెప్పారు.

23న రేషన్‌డీలర్ల మహాసభ

మదనపల్లె : రేషన్‌డీలర్ల సమస్యల పరిష్కారం కోసం జూలై 23న విజయవాడలో రేషన్‌డీలర్ల మహాసభ నిర్వహిస్తున్నట్లు జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మౌలాలి తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విజయవాడ రేషన్‌డీలర్ల మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మౌలాలి మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని రేషన్‌డీలర్లు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్లు కురబలకోట ప్రెసిడెంట్ ఎస్.ఎం.బాషా, రామసముద్రం మండల ప్రెసిడెంట్ సుగుణమూర్తి, కదిరప్ప, ఆర్.సుబ్రహ్మణ్యం, ఎస్.ఇమామ్, ఖాసీం, రవి, చిరంజీవి, సతీష్, కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థుల ఎంపిక

మదనపల్లె సిటీ: ట్రిపుల్ ఐటీకి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పాఠశాలలో అభినందన కార్యక్రమం జరిగింది. హెచ్ఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ పదో తరగతిలో చూపిన ప్రతిభ స్ఫూర్తితో ఉన్నత చదువుల్లో కూడా రాణించాలన్నారు. పాఠశాలకు చెందిన నిహారి, సుమిత్ర, రెడ్డి రాఘవి, ఎం.పి.గుల్‌షమ్ రసూల్‌లు ఇడుపులపాయ క్యాంపస్‌కు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఉపాధ్యాయులు పఠాన్ మహమ్మద్‌ఖాన్ జ్ఞాపికలు, మెడల్స్,ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు జబేదాబేగం,పద్మజ విద్యార్థులకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు.

సర్వేయర్ సస్పెన్షన్

కురబలకోట : మండల సర్వేయర్ భువనేశ్వరిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు శనివారం తెలిపారు. ఎన్‌హెచ్ –42 రోడ్డు విస్తరణ సర్వేలో మండలంలోని అంగళ్లు భూములపై నిర్లక్ష్యం వహించారన్న కారణంగా అప్పై సంబంధిత రైతుల డాక్యుమెంట్లు సమర్పించలేదన్న కారణంగా చర్యలు తీసుకున్నట్లు సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

17న చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలు 17న (సోమవారం) నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పు రామచంద్ర,కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. ఆలయ కమిటీ, తొగట వీరక్షత్రియ యువజన సంఘం, శ్రీచౌడేశ్వరి యువజన సేవా ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



ములకలచెరువు: సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



వాల్మీకిపురం : లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

- వలంటీర్లపై విషం కక్కుతున్న పవన్
- పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాల లబ్ధి
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం సోంపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే సేవలను అందిస్తున్నారన్నారు. వలంటీర్లు సీఎం ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ సమాజంలో అందరి వద్ద మంచి పేరు తెచ్చుకుంటున్నారన్నారు.

జగనన్న సురక్ష వినియోగించుకోండి :
జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎటువంటి సర్వీసు చార్జీ లేకుండా ఉచితంగా అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. అనంతరం సర్టిఫికెట్లను అర్హులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ అశ్విని, ఎంపీపీ సాయిలీలా, సర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ క్రిష్ణప్ప, ఏపీఎం హరినాథ్, వైఎస్సార్‌సీపీ, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సామాన్యులకు తోడుగా జగనన్న సురక్ష
వాల్మీకిపురం : సామాన్యులకు తోడుగా జగనన్న సురక్ష కార్యక్రమం నిలుస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం వాల్మీకిపురం సచివాలయం 4 పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో బాధపడుతున్న వారి కుటుంబాలను ఆదుకున్న ఘనత వలంటీర్లదే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఎవరైనా అర్హులైన వారుంటే పథకాలు అందజేయాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఈవో ఉదయ్ కుమార్, జెడ్పీటీసీ నిర్మల, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు మహబూబ్‌బాషా, రాయుడు, రవి, రఘు, రాజేష్, సాధిక్, ఇర్ఫాన్, షాహెద్, బికెన్ మస్తాన్, సైఫుల్లా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేసేందుకే..
పెద్దతిప్పసముద్రం : అర్హులను గుర్తించి వారికి న్యాయం చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. కందుకూరు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్, సర్పంచ్ రహ్మతుల్లా, వైస్ ఎంపీపీ శోభా, ఎంపీటీసీ కేశవ్‌ల సమక్షంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

జగనన్న సురక్ష పేదలకు వరం
పీలేరు : జగనన్న సురక్ష పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ఎంపీడీఓ డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేగళ్లు, కావలిపల్లె గ్రామ సచివాలయల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎలాంటి రుసుములు చెల్లించకుండా 11 రకాల సేవలు ఉచితంగా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే చైర్మన్ మల్లికార్జున, డీటీ సుబ్రమణ్యం, సర్పంచ్ ఉమాదేవి, నాయకులు అశోక్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, రాజేష్, చెంగల్‌రాయులు పాల్గొన్నారు.

జనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి
కేవీపల్లె : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరసింహులు అన్నారు. శనివారం మండలంలోని జిల్లేళ్లమంద గ్రామ సచివాలయంలో సుగాలితాండా, జిల్లేళ్లమంద, వడ్డకుంటకొత్తపల్లె గ్రామ పంచాయితీలకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, సర్పంచ్‌లు కృష్ణవేణి, అమ్ములు, వారాదమ్మ, నాయకులు గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు సంక్షేమ పథకాలు
తంబళ్లపల్లె: నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు పరుస్తున్నట్లు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణ తెలిపారు.శనివారం గోపిదిన్నె సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఏపీయం గంగాధర్, ఏపీవో అంజనప్ప పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఎంపీడీఓ భానుప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొత్తపల్లె-2 గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, స్పెషల్‌ఆఫీసర్, ఐసీడీయస్ పీడీ ధనలక్ష్మి, సర్పంచ్ రెడ్డెమ్మ, ఎంపీటీసీ బబ్లీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ... జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూన్ 24 నుంచి జూలై 22 వరకు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారని చెప్పారు. సచివాలయాల ద్వారా ఇప్పటికే ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని..ఇంకా ఎవరికైనా అర్హత ఉండి లబ్ధి చేకూరకపోతే జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యుల అండదండలతోనే పథకాలు వచ్చేవని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ, సిఫారసులు లేకుండా అర్హత ఉంటే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్నా మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వెలుగుచంద్ర, మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గాడసాని వెంకటరమణ, డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ పోతబోలునాగరాజు, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, బావాజాన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటల ద్వారా అంగన్‌వాడీల్లో విద్య

ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువును చూస్తున్న పీడీ ధనలక్ష్మి

మదనపల్లె : ఆటపాటలతో విద్య నేర్పడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎంతగానో అభివృద్ధి చెందుతారని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్‌కు సంబంధించి యాక్టివిటీస్‌ను మరింతగా పెంచాలని ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి ఆదేశించారు. శనివారం మదనపల్లె ఐసీడీయస్ ప్రాజెక్ట్ పరిధిలోని బొమ్మనచెరువు సెక్టార్ ఈశ్వరమ్మ ఇండ్లు-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ యాక్టివిటీస్‌లో భాగంగా బ్లూ కలర్ డే నిర్వహించి, పిల్లలతో యాక్టివిటీస్ చేయించినట్లు సిబ్బంది చెప్పారు. ఈ సందర్భంగా పీడీ ధనలక్ష్మి మాట్లాడుతూ..పిల్లల సంపూర్ణ అభివృద్ధి, మేధస్సు పెంపొందించి, బడికి సంసిద్ధులను చేయడం ప్రీ స్కూల్ ముఖ్య ఉద్దేశమన్నారు. మూడు నుంచి ఆరేండ్లలోపు పిల్లల్లో మెదడు శరవేగంగా అభివృద్ధి చెందే దశలో వారికి అవగాహనతో కూడిన విద్యను అందించాలన్నారు. రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను అన్నివసతులతో నూతన హంగులతో తీర్చిదిద్దిందన్నారు. గర్భిణీలు, పాలిచ్చేతల్లులు, 0-6 ఏళ్లలోపు పిల్లల పేర్లను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదుచేయించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో స్టాక్ తనిఖీ చేశారు. కేంద్రంలో అందిస్తున్న సేవలపై తల్లుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. పిల్లల బరువును చూసి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ చంద్రకాంత, సిబ్బంది పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలి

కేవీపల్లె : వేరుశనగ సాగులో రైతులు సరైన మెలకువలు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.వి. శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నూతనకాల్వ రైతు భరోసా కేంద్రంలో శనివారం వేరుశనగ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధి చేసుకునే విధానం రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కలుపు నివారణకు విత్తనం విత్తిన మూడు రోజుల్లోపు పెండిమిథాలిన్ పిచికారి చేయాలని సూచించారు. ఊడలు దిగే సమయంలో ఎరాకు 200కేజీల చొప్పున జిప్సంను వేయాలని తెలిపారు. కిసాన్ డ్రోన్ ప్రాజెక్టు రాయితీతో లభిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రావణి, వ్యవసాయ విస్తరణాధికారి అనితాదేవి, వీఏఏ మౌనిక, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : సంక్షేమపథకాలు అమలుచేస్తూ పేద ప్రజల అభివృద్ధి కోసం పాటుపడుతున్న ప్రజా సంక్షేమ ప్రభుత్వమైన వైఎస్సార్ సీపీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా కోరారు. శనివారం మండలపరిధిలోని సామకోటవారిపల్లె పంచాయతీలోని సామకోటవారిపల్లె, తరిగొండవారిపల్లె, నాయనవారిపల్లె, ఎర్రంపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ మహదేవరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జ్ రమణారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అందజేసిన సంక్షేమ సాయాన్ని వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణశాఖ, రెవెన్యూశాఖకు సంబంధించిన పలుసమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. విధులకు ఆలస్యంగా హాజరవుతూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్తూ, పద్ధతి మార్చుకోవాలని క్లస్టర్ పంచాయతీ కార్యదర్శి మంజుల, స్థానిక సచివాలయ ఉద్యోగులైన ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీఆర్వోలను హెచ్చరించారు. మరోసారి విధుల్లో నిర్లక్ష్యం చూపితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, ఉషారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, నాగరాజ, రమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, పంచాయతీ కార్యదర్శులు మంజుల, నాగమల్లి, ఎస్ఐ రామకృష్ణ, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న కృతనిశ్చయంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాలు అమలుచేస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం మండలపరిధిలోని సామకోటవారిపల్లె సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష క్యాంపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు ఉషారాణి, జి.శ్రీవాణి, సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఈఓపీఆర్డీ చలపతిరావు, పంచాయతీకార్యదర్శి మంజుల, నాగమల్లి పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీ, పునుగుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ గత పాలకులు ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేశారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పూర్తిస్థాయిలో మద్దతు తెలిపి మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిడివో షబ్బీర్ అహ్మద్, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, ఈవో ఉదయ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు కేశవ రెడ్డి, సురేష్ రెడ్డి, శివారెడ్డి, రవి, రఘు, శీనా, కిరణ్ కుమార్, వెంకట్రమణ, లక్ష్మీనారాయణ రెడ్డి, ఫారుఖ్, మెంబరు శీనా, మదనమోహన్ రెడ్డి, అమీనీపీర్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.



చేతులెత్తి మొక్కుతూ..



ఈచిత్రంలో చేతులెత్తి దండం పెడుతూ కనిపిస్తున్నది కలిచెర్ల గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లు. లాక్‌డౌన్ సమయంలో దుకాణాలు మూసి కరోనా ప్రబలకుండా సహకరించాలని కోరుతూ కలిచెర్ల కూడలిలో ఉన్న దుకాణదారులను కోరుతున్నారు. లాక్‌డౌన్ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బయటకు రాకుండా అవగాహన కల్పించారు. గ్రామంలో రెడ్‌జోన్ ప్రకటించినా ప్రజలు కరోనా బారిన పడకుండా ఉండేందుకు వలంటీర్లు ధైర్యంగా ముందుకు వచ్చి అప్రమత్తం చేశారు. తాము రక్షణ చర్యలు తీసుకుంటూ గ్రామ ప్రజలకు సేవలందించి వలంటీర్లు గ్రామస్తులచే శభాష్ అనిపించుకున్నారు. – పెద్దమండ్యం

ధైర్యంగా సేవలందించారు



కరోనా సమయంలో గ్రామ పరిధిలోని వలంటీర్లు ప్రజలకు ధైర్యంగా తమ సేవలను అందించారు. కరోనా కేసులు రావడంతో అధికారులు రెడ్‌జోన్‌గా ప్రకటించడం, లాక్‌డౌన్ విధించారు. ఆ సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో వలంటీర్లు ఎంతో సాహసంతో ముందుకు వచ్చారు. కరోనా బారిన ప్రజలు పడకుండా వలంటీర్లు అందించిన సేవలు నేటికి మర్చిపోలేనివి.

– విశ్వనాథ, గ్రామ సర్పంచ్

అభాగ్యుల జీవితాల్లో వెలుగు



కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లె సచివాలయ గ్రామ వలంటీరు బండపల్లె ఉషారాణి ఇద్దరి అభాగ్యులకు ఆధార్ కార్డు తెప్పించి వారి జీవితానికి కొత్తదారి చూపించి బడిలో చేర్పించింది. ఆధార్ రావడంతో అమ్మ ఒడి, విద్యా కానుక కిట్లు కూడా అందాయి. బండపల్లెలోని గోపిదిన్నె భాను ప్రసాద్ (12) అతని చెల్లెలు గోపిదిన్నె భువనేశ్వరి (9)లది నిరుపేద కుటుంబం. వీరి తల్లిదండ్రులు నాగేశ్వరి, సాంబశివ దళితులు. ఐదుగురు పిల్లలు. ఇటుక బట్టీల పనిలో కూలీలుగా వెళుతున్నారు. పిల్లలకు ఆధార్ లేకపోవడంతో వీరికి పథకాలు అందలేదు. విషయం తెలిసి వలంటీరు ఉషారాణి అఫిడవిట్ చేయించి తహసీల్దారు ద్వారా సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపి బర్త్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేశారు. పుట్టినతేదీ సర్టిఫికెట్లు రావడంతో వారికి ఆధార్ కార్డులు తీయించారు. వీరి పేర్లు రేషన్ కార్డులో కూడా నమోదు చేయించారు. పక్కనే ఉన్న చింతమాకులపల్లె ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించారు. దీంతో ఇటీవల వారికి అమ్మ ఒడి పథకం రూ.15 వేలు వచ్చింది. ఇప్పుడు భానుప్రసాద్ 6వ తరగతి, భువనేశ్వరి 4వ తరగతి చదువుతున్నారు. – కురబలకోట

జీవితంలో మరువురానిది



వలంటీరు మా కుటుంబ జీవితాన్నే మలుపు తిప్పింది. మాకు ఐదు మంది పిల్లలు. రెక్కల కష్టంతో బతుకుతున్నా. మా బిడ్డలకు ఎంతో ముఖ్యమైన ఆధార్ కార్డులు కూడా తీయించలేకపోయాం. వలంటీర్ సాయంతో ఆధార్ వచ్చింది. కుటుంబ సభ్యురాలిగా సేవలు అందించారు. జీవితంలో మరువురానిది. ఇద్దరు బిడ్డలు ఇప్పుడు ప్రభుత్వ బడికి సంతోషంగా వెళుతున్నారు. – నాగేశ్వరి, సాంబశివ

నెల్లూరుకెళ్లి బాధితురాలికి ఫింఛన్..



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు సీకే ముజామిల్. కలికిరి పట్టణానికి చెందిన వలంటీరుగా పనిచేస్తూ తన పరిధిలోని ప్రజలకు సేవలందిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఓ వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు పట్టణంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి అక్కడే ఉండి వైద్య చికిత్సలు పొందుతోంది. ఫించను తీసుకోవడానికి ఆమె రాలేని స్థితిని తెలుసుకున్న వలంటీరు ముజామిల్ ఆమె ఉన్న చిరునామా కనుక్కుని సుమారు 220 కిలో మీటర్లు ప్రయాణించి అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి ఫించను అందించాడు. దీంతో బాధితురాలి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. – కలికిరి

ఇంటింటికి తలుపు తట్టి సేవలు



గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా ఫించను కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు కాళ్లరిగే తిరిగేవాళ్లం. అక్కడికి వెళ్లినా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండకూ, వానకూ వెరసుకుని కాపుకాసేవాళ్ళం. వలంటీరు వ్యవస్థతో ఇంట్లో కాలు బయటపెట్టకుండానే ప్రతి నెలా 1న ఉదయం 5గంటలకే వలంటీర్లు తలుపు తట్టి పింఛను ఇస్తున్నారు. వృద్ధులను గౌరవప్రదంగా బతికేలా చేస్తున్నారు. – రెడ్డెమ్మ, ఇందిరమ్మకాలని, కలికిరి

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పీలేరు : పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం వాటర్‌మెన్లు, పారిశుద్ధ్య, ఎలక్ట్రిషియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పైపులైన్లు, గేట్‌వాల్వులు ఎప్పటికప్పుడు మరమ్మతు పనులు చేపట్టి నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పట్టణంలో ఎక్కడా పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో విద్యుత్‌వీధిలైట్లు మరమ్మతులకు గురైతే తక్షణం రిపేరు చేయాలని ఆదేశించారు. అనంతరం సర్పంచ్ సొంత నిధులతో పంచాయతీ కార్మికుల కుటుంబాలకు ఆటవిడుపుకోసం 115 పానులు పంపిణీ చేశారు. ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

డీఎస్పీ కేశప్ప



మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

పెద్దతిప్పసముద్రం : రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. శనివారం మదనపల్లి డీఎస్పీ కేశప్ప, రూరల్ సీఐ శివాంజనేయులు స్థానిక పోలీస్ స్టేషన్‌లోని ఎస్ఐ రవీంద్రబాబుతో పాటు మహిళా పోలీసులతో సమీక్షించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో జనాభా, వారి వృత్తి, సదరు గ్రామంలోని ప్రార్థనా మందిరాలు, పాఠశాలల వివరాలు సమగ్రంగా ఉండాలన్నారు. ప్రధానంగా రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అంతేగాక వారి దినచర్యతో పాటు ఆర్థిక నేరగాళ్ళ కదలికలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యాకలాపాలు, కొత్త వ్యక్తుల సంచారంపై కూడా నిఘా ఉంచాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా ఉన్నతాధికారులకు తక్షణం సమాచారం అందించాలన్నారు. ఆత్మహత్యల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, దిశ యాప్ డౌన్‌లోడింగ్ చేయించాలన్నారు. అనంతరం డీఎస్పీ, సీఐలు టి.సదుం పంచాయతీలోని చెన్నరాయునిపల్లికి విచ్చేసిన రాష్ట్ర లోకాయుక్తా జస్టిస్ పీ.లక్ష్మణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

డీఈఐసీ, డీ అడిక్షన్ కేంద్రాలు తనిఖీలు

మదనపల్లె సిటీ : మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని డీఈఐసి (చిన్న పిల్లల అత్యవసర చికిత్స కేంద్రం), డీ అడిక్షన్ కేంద్రాలను జిల్లా డీపీఎం డాక్టర్ లోకవర్ధన్, ఆర్‌బీఎస్‌కె జిల్లా ప్రొగ్రామ్ అధికారి డాక్టర్ శేషగిరిబాబులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీల నుంచి రెఫర్ చేసిన పిల్లలకు డీఈఐసీలో చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పుట్టుకలతో వచ్చు లోపాలు, పోషకాహార లోపాలు, పెరుగుదల, అభివృద్ధి లోపాలు వంటివి గుర్తించి వారిని చికిత్స అందిస్తామన్నారు.